# కొలాంల మనుగడ ప్రశ్నార్థకం చేస్తే ఊరుకోం..



ఉట్నూర్‌లోని ఐటీడీఏ ఎదుట బైఠాయించిన గిరిజనులు

ఉట్నూర్, డిసెంబర్ 16 : కొలవార్లు కొలాంగా గుర్తింపు పొందుతూ తమకు అన్యాయం చేస్తే ఊరుకోమని ఆదిమ కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్, గౌరవ అధ్యక్షుడు ఆత్రం బాలేరావులు అన్నారు. సోమవారం ఛలో ఐటీడీఏ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొలాం గిరిజనులమైన తమకు పూర్వం నుంచి కొలామి భాష వాడుకలో ఉండి తాము కొలవార్‌గా ఈ పందం వాడడం జరుగుతుందన్నారు. కానీ.. మన్నేవార్‌లకు ఈ పదం ప్రభుత్వాలు కేటాయించడంతో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. కావున వెంటనే వారికి ఆ పదం తొలగించాలని డిమాండ్ చేశారు. మన్నేవార్‌ల, కొలాంల సంస్కృతి, సంప్రదాయాలు వేరు వేరుగా ఉంటాయన్నారు. కొలాంలకు ప్రత్యేక భాష ఉందన్నారు. కాని మన్నేవార్లకు భాష తెలుగుగా ఉందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. మన్నేవార్లకు కొలవార్ పదాన్ని తొలగించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నగేశ్, నాయకులు గోవింద్‌రావు, దిలీప్, ఆత్రం శ్రీను, ఆత్రం మహేశ్ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

# రేవంత్ మాట నిలబెట్టుకోలే..

## చెవిలో పూలు పెట్టుకుని సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి యేడాది అవుతున్నా.. హామీలను నెరవేర్చలేదని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్స్‌ను నెరవేర్చాలని సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా వారు చెవిలో పూలు పెట్టుకుని సీఎం సారూ మా హామీలేమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నామని, తక్షణమే స్పందించి టైం స్కేలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, వీణ, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీలత, గంగామణి, ప్రభ, సునీత పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎదులాపురం, డిసెంబర్ 16 : విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ పోటీల్లో రాణించి, ఉత్తమ ఫలితాలను సాధించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. వారితో కలిసి వాలీబాల్ ఆడుతూ ఉత్సాహపరిచారు. విద్యార్థులు ప్రదర్శించిన జూడో, కుస్తీ విన్యాసాలు అబ్బురపరిచాయి. జిల్లా స్థాయిలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, పుట్‌బాల్, చెస్, బాక్సింగ్, స్విమ్మింగ్‌లతోపాటు వివిధ పోటీల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని కనబరచనున్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని, రాష్ట్రస్థాయిలో వారు సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ నెల 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 16 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని జ్యోతి ప్రజ్వలన చేశారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఈశ్వర్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, పేటా అధ్యక్షుడు భుక్యా రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



బేల మండలంలోని డోప్తాలలో ఇందిరమ్మ ఇండ్ల వివరాలను నమోదు చేస్తున్న పంచాయతీ సిబ్బంది(ఫైల్)



# సొంతిళ్లు కలేనా?

● కొనసాగుతున్న ఇండ్ల వివరాల నమోదు ● ప్రజాపాలనలో 1.97 లక్షల మంది దరఖాస్తు ● యేడాదైనా కొనసాగుతున్న ప్రక్రియ

ఆదిలాబాద్, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా యేడాది కిందట ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సొంతిళ్లు లేని 1.97 మంది దరఖాస్తులు సమర్పించారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై ఏడాది తర్వాత స్పందించిన ప్రభుత్వం ఇటీవల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా యాప్‌ను విడుదల చేసింది. పట్టణంలో మున్సిపాలిటీ వార్డు అధికారులు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తుదారులు ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా.. ప్రభుత్వం తొలి విడుతలో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేసింది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతోపాటు ఖానాపూర్ నియోజకవర్గం మూడు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో రెండు మండలాలు ఉన్నాయి. కేవలం ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి 71,609 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా ఒక్కో మండలానికి 700 ఇండ్లు, బోథ్ నియోజకవర్గంలో తొమ్మిది మండలాలు ఉండగా మొదటి విడుతలో ప్రతి మండలానికి 388 ఇండ్లు మాత్రమే వచ్చే అవకాశాలున్నాయి. మొదటి విడుతలో సొంత స్థలం ఉన్న పేదలకు రూ.5 లక్షలు మంజూరు చేస్తారు. ఇంటి నిర్మాణంలో భాగంగా దశలవారీగా మూడు విడుతల్లో లబ్ధిదారులకు డబ్బులు అందజేస్తారు. ప్రభుత్వం యాప్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించడంలో దరఖాస్తుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎక్కువ ఇండ్లను మంజూరు చేసి అర్హులైన వారందరికీ ఇండ్లను అందజేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



బేల మండలంలోని శంషాబాద్‌లో వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

| మండలం | దరఖాస్తుదారులు |
|---|---|
| ఆదిలాబాద్ అర్బన్ | 31,153 |
| ఉట్నూర్ | 17,515 |
| జైనథ్ | 15,476 |
| బోథ్ | 13,056 |
| ఇచ్చోడ | 12,874 |
| బేల | 12,083 |
| ఇంద్రవెల్లి | 11,687 |
| ఆదిలాబాద్ రూరల్ | 11,392 |
| తలమడుగు | 10,551 |
| గుడిహత్నూర్ | 9,514 |
| నేరడిగొండ | 8,902 |
| బజార్‌హత్నూర్ | 8,797 |
| నార్నూర్ | 8,714 |
| భీంపూర్ | 7,433 |
| గాదిగూడ | 6,474 |
| సిరికొండ | 5,470 |
| తాంసి | 4,852 |
| మావల | 1,505 |
| మొత్తం | 1,97,448 |

# మాఫీ అయ్యేనా?

## రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతుల్లో ఆందోళన

● నాలుగు విడుతలైనా పూర్తి కాని రూ.2 లక్షల మాఫీ ● నిర్మల్ జిల్లాలో మాఫీకి నోచుకోని రైతులు 30,000 మంది
● ఒక్క వాలేగాం గ్రామంలోనే 170 మందికి మాఫీ కాలే.. ● కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

నిర్మల్, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ) : ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. యేడాది పాలనలో జిల్లా రైతాంగాన్ని ఆగం చేసింది. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే విస్మరించింది. రూ. 2 లక్షల రైతు రుణాలను ఒకే విడుతలో మాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ.. నాలుగు నెలలుగా ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటి వరకు మూడు విడుతల్లో చాలా మందికి మాఫీ కాలేదు. బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ లేదని, రేషన్ కార్డులో పేరు లేదని.. ఇలా రకరకాల కారణాలతో మాఫీ కాలేదు. మాఫీ కాని వారి నుంచి వ్యవసాయాధికారులు దరఖాస్తులను స్వీకరించి, వారి సెల్ఫీ ఫొటోతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 13,433 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 6,823 మంది రైతులను మాత్రమే అర్హులుగా గుర్తించి నాలుగో విడుతలో వారి పేర్లను రుణమాఫీ జాబితాలో చేర్చారు. ఇంకా 6,610 మంది మాఫీకి నోచుకోలేదు. వీరితోపాటు రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు జిల్లా వ్యాప్తంగా 25 వేల నుంచి 30 వేల మంది ఉంటారని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.85 లక్షల పట్టా పాసు పుస్తకాలు ఉండగా, 1.20 లక్షల మంది రైతులు సమీపంలోని సొసైటీలు, బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని అధికారులు చెబుతున్నారు. వీరిలో 71,565 మందికి మాత్రమే మాఫీ అయింది. ఇంకా.. దాదాపు 48 వేల మంది రైతులకు మాఫీ కాలేదు. వీరిలో 18 వేల మంది వరకు ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ పేయర్లు వంటి అనర్హులు పోగా, మిగతా 30 వేల మందికి రుణాలు పొందినవారు ఉంటారని అంచనా.

### మొండిచేయేనా?

భైంసా మండలంలోని వాలేగాంలో దాదాపు 450 మంది రైతు కుటుంబాలు ఉండగా, 170 మందికి నేటికీ రుణమాఫీ కాలేదు. నాలుగో జాబితాలోనూ తమ పేర్లు లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసి తమకు రుణం మాఫీ వర్తింపజేయాలని వేడుకున్నారు. ఒక్క వాలేగాం గ్రామంలోనే 170 మందికి రుణమాఫీ కాలేదంటే.. జిల్లా వ్యాప్తంగా ఇంకా ఎంతమంది రైతులకు మాఫీ కాలేదో అర్థం చేసుకోవచ్చు. ఇలా వేల సంఖ్యలో రైతులకు రుణమాఫీ పెండింగ్‌లో ఉండడంతో తమకు మాఫీ అవుతుందా? లేదా అనే అయోమయంలో అన్నదాతలు ఉన్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మాఫీ ఎందుకు వర్తించడం లేదని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి, తీరా అధికారంలోకి వచ్చాక వేల సంఖ్యలో రైతులకు మొండిచేయి చూపడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.




దాదాపు 50 శాతం మంది రైతులు రుణమాఫీకి నోచుకోని వాలేగాం గ్రామం

### మా ఊరిలో 170 మందికి రుణమాఫీ కాలే..



*మాది భైంసా మండలంలోని వాలేగాం గ్రామం. మా ఊరిలో దాదాపు 450 మంది రైతులు ఉంటరు. ఇందులో 170 మందికి రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణాలున్న వారు 50 మంది దాక ఉండగా, మిగతా వారంతా రూ.2 లక్షల పైన ఉన్నవారే. మొన్న వచ్చిన రుణమాఫీ నాలుగో జాబితాలో కూడా మా పేర్లు లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరినం. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రూ.2లక్షల దాక రైతులందరి రుణాలను మాఫీ చేస్తామన్నరు. కానీ.. ఇప్పుడు కొందరికే చేసిన్రు. మేమేం పాపం చేసినం. రుణమాఫీ లేదు, రైతుబంధు లేదు. రైతులను ఇంత ఇబ్బంది పెట్టడం కాంగ్రెసోళ్లకు మంచిది కాదు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగుల్తది. నాకు నా భార్యకు చెరో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఇద్దరం కలిసి దేగాం దక్కన్ గ్రామీణ బ్యాంకుల రూ.4 లక్షల దాకా రుణం తీసుకున్నం. మాది ఒకే కుటుంబంగా గుర్తించి ఇస్తామన్న రెండు లక్షలను ప్రభుత్వం మాఫీ చేస్తే మిగతా రెండు లక్షలు మేం కట్టుకుంటం కదా. ఒకవేళ మేం లోన్ కట్టకుంటే మా భూమిని బ్యాంకోళ్లు జప్తు చేసుకుంటరు. మా ఆస్తి కుదువ పెడితేనే కదా బ్యాంకు లోన్ ఇచ్చింది. పనికిమాలిన ఆంక్షలు పెట్టి రైతులను కష్టపెట్టడం కరెక్టు కాదు. రైతులకు అడ్డగోలు హామీలిచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయిండు. ఒక్కటి కూడా సక్కగ చేస్తలేదు. కేసీఆర్ ప్రభుత్వమే రైతులకు అన్ని విధాలా మంచిగుండే.*

**- పోతన్న, రైతు, వాలేగాం, భైంసా మండలం.**

# ముగిసిన గ్రూప్-2 పరీక్ష



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 16 : ఆదిలాబాద్ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయి. ఆది, సోమవారాల్లో పరీక్షలు కొనసాగగా.. 29 కేంద్రాల్లో నిర్వహించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు నిర్దేశిత సమయాని కంటే ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వారిని గంట ముందుగానే క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. సమయానికి నిమిషం ఆలస్యమైనా కూడా... లోనికి అనుమతి ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులు పరుగు పరుగున కేంద్రాల వద్దకు చేరుకున్నారు. సోమవారం జరిగిన పరీక్షకు 10,428 మంది అభ్యర్థులకు 5,773 మంది హాజరు కాగా.. 4,655 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షాతోపాటు, ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రత కల్పించారు.

### నిర్మల్‌లో ప్రశాంతం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 16 : నిర్మల్ జిల్లాలో సోమవారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజులపాటు అధికారులు పరీక్షను నిర్వహించారు. ఆదివారం పేపర్-1,2 పరీక్షను నిర్వహించగా.. రెండో రోజైన సోమవారం పేపర్-3,4 నిర్వహించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎస్పీ జానకి షర్మిల 163 సెక్షన్‌ను అమలు పరిచారు.



నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రాయపూర్ కాండ్లీ రైతులు

# రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వండి సారూ..

లోకేశ్వరం, డిసెంబర్ 16 : రుణమాఫీ, రైతు భరోసా కల్పించాలని కోరుతూ లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీ రైతులు సోమవారం రెవెన్యూ అడిషన్ కలెక్టర్ కిశోర్ కుమార్‌ను కలిశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రైతు భరోసా రాలేదని, తక్షణమే రుణమాఫీ కానీ రైతులకు మాఫీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాలం గంగాధర్, కిషన్, దేవేందర్, సుధాకర్, తోట నర్సయ్య, దండేరి భోజన్న, నర్సయ్య పాల్గొన్నారు.